


డీసీసీబీ చైర్మన్‌గా ఎవరు?

- నిజాంపాషా రాజీనామాతో కొత్త చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ
- విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటయ్య, మంజులారెడ్డి పోటీపడుతున్నట్లు సమాచారం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28తో ముగియనున్న ప్రస్తుత పాలకవర్గం గడువు
- కొత్త చైర్మన్ ఎన్నిక కోసం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం



డీసీసీబీ కార్యాలయం





మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



కోరమోని వెంకటయ్య



కంకటి మంజులారెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీకి కొత్త చైర్మన్ ఎవరు అవుతారనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. ఈ డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. మొత్తం సొసైటీలను అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. షెడ్యూల్ ప్రకారం ఈ ఎన్నికలకు మరో ఆరు నెలలు గడువు ఉంది. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న చిట్యాల నిజాంపాషా గత నెల చివరి తేదీన తన పదవికి రాజీనామా చేశారు. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన తనకు ఆరోగ్యం సహకరించడం లేదని పదవిని వదులుకున్నారు. ఎప్పుడో ఆయన పదవి నుంచి దిగిపోతాడని ప్రచారం జరిగినప్పటికీ అలాగే నెట్టుకుంటూ వచ్చారు. అయితే ఇప్పుడు ఆయన రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో ఎవరు చైర్మన్ అవుతారనే విషయంలో మాత్రం అందరికీ ఆసక్తి నెలకొంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలన్నీ రైతులకు అనుబంధంగా పని చేస్తాయి. ఇందులో పదవులు ఉన్నవారిలో కూడా మెజారిటీ రైతులేనని చెప్పొచ్చు. ప్రస్తుత చైర్మన్ రాజీనామా చేయగా.. దాని కోసం రాష్ట్ర సహకార శాఖ నుంచి నోటిఫికేషన్ వెలువడితేనే కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలన్నీ దాదాపు అధికార పార్టీ కనుసన్నల్లోనే పని చేస్తాయి. సభ్యులు, డైరెక్టర్లలో మెజారిటీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే అయినప్పటికీ.. కాంగ్రెస్‌కు సంబంధించిన మంత్రులు, ముఖ్యనాయకుల మద్దతు కోసం పలువురు డైరెక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రయత్నాలు చేస్తున్న వారిలో కొందరు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరిపోగా.. కొందరు మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉన్నారు.

రాజీనామా చేసి 17 రోజులు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత కూడా ఇంకా ఉమ్మడిగా కొనసాగుతున్న ఏకైక సంస్థ ఇదేనని చెప్పొచ్చు. జిల్లా పరిషత్‌లు కూడా గత ఎన్నికల సమయంలోనే విభజన కాగా.. కేవలం డీసీసీబీ అలాగే కొనసాగుతోంది. జిల్లా మార్పిడమో లేక చట్టం చేయడమో చేస్తే తప్ప, ఈ విభజన జరిగే అవకాశం లేదు. అయితే 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 15 మంది డైరెక్టర్లుగా ఉంటారు. ఇందులో ఏ క్లాస్ డైరెక్టర్లు 12 మంది కాగా.. బీ క్లాస్ డైరెక్టర్లు మరో ముగ్గురు ఉన్నారు. ఏ క్లాస్ డైరెక్టర్లంటే వ్యవసాయ సహకార సంఘానికి చెందిన వారు. బీ క్లాస్ డైరెకర్లు ఇతర సహకార సంఘాలకు చెందిన వారు. వీరికి ఓటు హక్కు ఉంటుంది కానీ.. వారు పోటీలో ఉండటానికి అర్హత ఉండదు. కేవలం ఏ క్లాస్‌లో ఉన్న 12 మంది డైరెక్టర్లు మాత్రమే పోటీ చేయాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో మెజారిటీ పాలక వర్గాలను దక్కించుకున్న బీఆర్ఎస్ పార్టీ.. తమ అభ్యర్థిగా చిట్యాల నిజాంపాషాను ఎంపిక చేసి, చైర్మన్‌గా ఎన్నుకుంది. కోరమోని వెంకటయ్యను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. చైర్మన్ నిజాంపాషా గత నెల 31వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికి దాదాపు 17 రోజులు అయినప్పటికీ.. ఇంకా కొత్త చైర్మన్ ఎన్నికపై ఎలాంటి దృష్టి సారించలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం కొంతమంది డైరెక్టర్లతో సమావేశమైనట్లు తెలుస్తోంది. ఎన్నికకు ఎప్పుడు నోటిఫికేషన్ ఇస్తారో? ఎప్పుడు ఎన్నిక ఉంటుందోనని డైరెక్టర్లు ఎదురుచూస్తున్నారు.

ఆరు నెలల పదవి కాలానికి గాను.. చైర్మన్ పదవి కోసం ముగ్గురు డీసీసీబీ డైరెక్టర్లు పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురు కూడా నిజాంపాషా ఎన్నిక సమయంలో చైర్మన్ గిరిని ఆశించినవారే కావడం విశేషం. ఆరు నెలలకు ఇది వృథా ప్రయాసే. అయినప్పటికీ.. వచ్చే పాలకవర్గం నాటికి బలంగా తయారై ఎన్నికల్లో మళ్లీ పదవిని పొందొచ్చనే ఆలోచనలో ఉన్నారు. మహబూబ్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ అయిన కోరమోని వెంకటయ్య గతంలోనే చైర్మన్ పదవిని ఆశించారు. అయితే కొన్ని రాజకీయ సమీకరణాలు, మంత్రుల ప్రాబల్యం వల్ల ఆయనకు పదవి దక్కలేదు. వైస్ చైర్మన్ పదవి లభించింది. ఇప్పుడు ఆయన చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అలాగే వనపర్తి జిల్లా పానగల్ పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉన్న మామిళ్లపల్లి

ముగ్గురి మధ్యలో పోటీ..

విష్ణువర్ధన్‌రెడ్డి కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. ఆయన కూడా గతంలో సీరియస్‌గా ప్రయత్నించారు. జూపల్లి కృష్ణారావు నియోజకవర్గమే అయినప్పటికీ వారిద్దరి మధ్య పలు మార్లు విభేదాలు, పలు సందర్భాల్లో స్నేహ సంబంధాలు ఉన్నాయి. మరి ప్రస్తుత పరిస్థితి ఏంటి? పోటీలో ఉంటే మంత్రి సహకరిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో పోటీదారు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మేకగూడ పీఏసీఎస్ చైర్‌పర్సన్ కంకటి మంజులారెడ్డి అనే ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె పోటీ పడుతున్నప్పటికీ.. ఆమెకు ఎంత మంది డైరెక్టర్లు మద్దతు ఇస్తారో వేచిచూడాలి. రంగారెడ్డి జిల్లా పరిధిలో ఈ డీసీసీబీకి సంబంధించిన పీఏసీఎస్‌లు తక్కువగానే ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి విభజన అయిన తర్వాత సంబంధాలు కూడా బాగా దెబ్బతిన్నాయి. మరి ఆమె డైరెక్టర్ల మద్దతు ఎలా కూడగడతారో వేచి చూడాలి. మొత్తం 15 మంది డైరెక్టర్లలో 12 మందికి పోటీ అవకాశం ఉండగా.. అందరికీ ఓటు వినియోగించుకోవచ్చు. అధికారికంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారు ఇప్పటివరకు ముగ్గురే కావడం విశేషం.

గట్టు ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు చర్యలు

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రభుత్వ సలహాదారుతో కలిసి పనుల పరిశీలన



గట్టు ఎత్తిపోతల పనులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గట్టు, ఆగస్టు 17: గట్టు ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా గట్టు ఎత్తిపోతల పథకం పనులను ప్రభుత్వ సాగునీటి సలహాదారు ఆదిత్యనాథ్, స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరితతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం 1.32 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ రిజర్వాయర్‌ను భవిష్యత్ అవసరాల దృష్ట్యా టీఎంసీలను పెంచడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. 20 నుంచి 25 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించడానికి వ్యయ అంచనాలను సిద్ధం చేయాలని చెప్పారు. పథకం సామర్థ్యం పెంచడం వల్ల భవిష్యత్‌లో తాగు, సాగు నీటి కోసం ఇతర రాష్ట్రాలను బతిమిలాడే అవకాశం ఉండదన్నారు. ప్రస్తుతం పనులు ఏ మేర జరగాయని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ రహీముద్దీన్,

పోటాపోటీగా వాహనాలు

ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి గట్టు ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్తున్న సమయంలో మంత్రి కాన్వాయ్‌లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వాహనాలు పోటాపోటీగా వెళ్లాయి. మేము ముందంటే.. మేము ముందు అన్నట్లు వాహనాలు వెళ్లాయి. రాయపురం స్టేజీ సమీపంలో ఒక వర్గం వారికి సైడ్ ఇవ్వలేదని మరో వర్గం వారితో ఘర్షణ పడ్డారు. దీంతో కాన్వాయ్‌లో కాస్త ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను సమన్వయం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన స్కార్పియో వాహనం అద్దం కాస్త డ్యామేజ్ అయినట్లు గుర్తించారు.

చివరి ఆయకట్టు వరకు నీళ్లు

ధరూరు: గద్వాల నియోజకవర్గంలోని రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం పెంచేందుకు ఇరిగేషన్ అధికారులతో చర్చించి కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రేవులపల్లి జెన్‌కో ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతులకు రెండు పంటలకు నీటి కొరత లేకుండా, చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాలుగు టీఎంసీల కెపాసిటీ గల ర్యాలంపాడు రిజర్వాయర్‌ను ప్రస్తుతం 1.5 కెపాసిటీల నీటినే నింపుతుండటంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ దాదాపు 700 మీటర్ల వరకు లీకేజీల సమస్య ఉండటంతో చుట్టు పక్కల ప్రాంతాలకు ఎప్పుడైనా ప్రమాదం సంభవించొచ్చని, ఆ సమస్యలను త్వరగా పరిశీలించి నీటి సామర్థ్యం పెంచేలా ప్రభుత్వ సలహాదారుడితో చర్చించానన్నారు. ఈ విషయాలను ప్రభుత్వ సలహాదారు, ఇరిగేషన్ శాఖల అధికారులు ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు.

త్వరలోనే ర్యాలంపాడు మరమ్మతు పనులు: ఎమ్మెల్యే

ధరూరు: ర్యాలంపాడు రిజర్వాయర్ మరమ్మతు పనులను త్వరలోనే చేపడతామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ లీకేజీ సమస్యను పరిష్కరించాలని, సామర్థ్యం నాలుగు నుంచి పది టీఎంసీలకు పెంచాలన్నారు. సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వ సలహాదారుడికి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

డీసీసీబీ పరిధిలో 34,730 మందికి రుణమాఫీ

- కష్టాలు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం
- ప్రాసెస్‌లోని రైతులకు రుణమాఫీ అర్హత
- మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాలమూరు, ఆగస్టు 17: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ఉమ్మడి జిల్లాలో 34,730 మంది రైతులకు రూ.రెండు లక్షలలోపు రుణమాఫీ చేసినట్లు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ హాలులో బ్యాంకు సిబ్బందితో రుణమాఫీపై ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల్లో భాగంగా కష్టాలు ఎదురైనా ఆగస్టు 15 వరకు రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు రాష్ట్రంగా బీఆర్ఎస్‌కు అప్పగిస్తే ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు మిగిల్చారన్నారు. బావ, బావమరుదులు(హరీశ్‌రావు, కేటీఆర్‌లు) రైతులకు రుణమాఫీ చేయలేదనే బేకార్ మాటలు మానుకోవాలని హితవు పలికారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ బ్యాంకు పరిధిలో డూప్లికేట్ రుణం పొందటం, మైనర్‌లకు రుణాలు ఇవ్వడం, ఇన్‌వాల్వ్‌డ్ రుణ మంజూరు అసలు కంటే వడ్డీ పెరగటం వంటి సాంకేతిక సమస్యలతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని గుర్తించినట్లు తెలిపారు. సిబ్బంది రాత్రీ పగలు కష్టపడి పని చేసి రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని ఆదేశించారు. రుణమాఫీ చేయడంలో అధికారుల అలసత్వం సమీక్షలో స్పష్టంగా కనిపిస్తుందని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అధికారులు శ్రద్ధగా పని చేయకపోతే రైతులకు మేలు జరగదన్నారు. ఇప్పటికైనా అధికారులు కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కోరమోని వెంకటయ్య, సీఈవో లక్ష్మయ్య, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల బంద్ విజయవంతం

- ఐఎంఏ పిలుపు మేరకు అన్ని ఆస్పత్రుల్లో నిలిచిన వైద్య సేవలు
- పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన వైద్య విద్యార్థులు
- తెలంగాణ చౌరస్తా వద్ద మానవహారం
- కలెక్టర్, ఎస్పీలకు వినతి



జనరల్ ఆస్పతి నుంచి ర్యాలీగా వెళ్తున్న డాక్టర్లు, వైద్యవిద్యార్థులు

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం) ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 24 గంట ఓపీ సేవల బంద్ విజయవంతం అయ్యింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో అత్యవసర సేవలు మినహాయించి మిగతా ఓపీ సేవలు నిలిచిపోయాయి. వైద్య విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో భారీ మానవహారం చేపట్టారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలను సమర్పించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు తమ దవాఖానాల ముందు బంద్‌కు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఫార్మసి, నర్సింగ్, ఫిజియోథెరపి కళాశాలలు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఆర్ఎంపీ క్లీనిక్‌లు సైతం స్వచ్ఛందంగా తమ సేవలను నిలిపివేశాయి. అయితే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఎస్వీఎస్ ఆస్పత్రులలో మాత్రం కేవలం ఎమర్జెన్సీ, ఐసీయూ సేవలను మాత్రం కొనసాగించారు.

వైద్య విద్యార్థుల భారీ ర్యాలీ

మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ, ఎస్వీఎస్ వైద్య కళాశాలలతో పాటు ఫిజియోథెరపి, నర్సింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో సమావేశం అయ్యారు. అక్కడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించి, అక్కడి నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తాకు వెళ్లారు. నిందితుడికి శిక్షపడాలని, మహిళలపై దాడులు అరికట్టాలని ప్లకార్డులు ప్రదర్శించుకుంటూ నినాదాలు చేశారు. వారి నినాదాలతో పట్టణమంతా హోరెత్తింది.

మానవహారం

వైద్య విద్యార్థులతో పాటు డాక్టర్లు సైతం అధిక సంఖ్యలో తెలంగాణ చౌరస్తాకు చేరుకొని భారీ మానవహారం నిర్వహించారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. ఇది ఒక్క డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కాదని, యావత్ భారత మహిళలకు జరిగిన హత్యాచారంగా భావించి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుడికి పడే శిక్ష భవిష్యత్తులో ఎవ్వరు కూడా మహిళలపై చేయివేయడానికే భయపడే విధంగా ఉండాలని అన్నారు. నిందితున్ని బహిరంగంగా ఉరితీయాలని విద్యార్థులు ముక్తకంఠంతో నినదించారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకిలకు వినతిపత్రాలు సమర్పించారు. తమ డిమాండ్ కోల్‌కతా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు.





రాస్తారోకోతో నిలిచిన వాహనాలు, జరిగిన అఘాయిత్యాన్ని కళ్లకు కట్టేలా ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

ఇబ్బందులు పడ్డ జనం

వైద్య సేవల బంద్‌తో మారుమూల ప్రాంతాల నుంచి ఆస్పత్రులకు వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. అన్నిచోట్లా ఓపీ సేవలు బంద్ చేయడంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లారు. కానీ అక్కడ సెక్యూరిటీ సిబ్బంది వారిని లోపలికి అనుమతించలేదు. డాక్టర్లు లేరని, ఓపీ సేవలు బంద్ అని చెప్పడంతో చేసేదేమి లేక వెనుతిరిగారు. అయితే క్యాజువాలిటీలో మాత్రం కొన్ని ఎమర్జెన్సీ సేవలు అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్, నాయకులు డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ సంపత్, డాక్టర్ విజయ్‌కాంత్, డాక్టర్ శ్యామ్యూల్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ కిరణ్‌ప్రకాశ్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డిలతో పాటు అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహారాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జిగా వంశీచంద్‌రెడ్డి



వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 17: త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రకు కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ వార్‌రూమ్ చైర్మన్ కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. అయినా అధిష్ఠానంతో ఆయనకున్న సత్సంబంధాల కారణంగా పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. మహారాష్ట్ర ఎన్నికలు ముగిసేవరకు చల్లా ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

ప్రాజెక్టులలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో నమోదు

గద్వాల, ఆగస్టు 17 : కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండుకున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలతో స్వల్పంగా వరద వస్తోంది. శనివారం ఆల్మటి పూర్తి సామర్థ్యం 129 టీఎంసీలు కాగా ప్రస్తుతం 128.19 టీఎంసీలకు చేరింది. 22,432 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15 వేల అవుట్ ఫ్లో ఉన్నది. నారాయణపూర్ పూర్తి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 37.38 టీఎంసీలు ఉన్నది. 20 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా రెండు గేట్లు ఎత్తి 10,640 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4,667 క్యూసెక్కులు విడుదల అవుతోంది. జూరాల ప్రాజెక్టు 9.35 టీఎంసీలకు చేరుకున్నది. ప్రాజెక్టులోకి 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో భీమా నది నుంచి 10 వేల క్యూసెక్కులు వస్తోంది. జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,806 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లోగా 34,496 క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 61,424 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1,050,531 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68,549 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 195.21 టీఎంసీలు నిల్వ ఉన్నది.

రాఖీ పూలు

పాలమూరు సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రాఖీ పుష్పాలు ఆకట్టుకుంటున్నాయి. గులాబీ, పర్పుల్ రంగుల్లో కనువిందు చేస్తున్నాయి. రాఖీ పండుగకు రెండు రోజుల ముందు పూసిన ఈ పూలను చూసిన పలువురు ఇవి నేచురల్ రాఖీలని అంటున్నారు. మార్కెట్‌లో లభించే ఖరీదైన కృత్రిమ రాఖీల కంటే బాగున్నాయని చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్





రాఖీ పూల ఆకారంలో పూసిన పుష్పాలు

కష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్ లభిస్తుంది : ఎస్ఐ

భూత్పూర్, ఆగస్టు 17: బాలికలు కష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్ లభిస్తుందని భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ సురక్షా పోలీస్ కళాబృందంతో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో, సురక్షా పోలీస్ బృందం కళాకారులు రాములు, జగదీష్, వరప్రసాద్, శ్రీనివాసులు, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు17: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 1.30 మిలియన్ యూనిట్లు నాలుగు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేయగా.. దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 1.580 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో 124 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగినట్లు ఆయన తెలిపారు.

జోగుళాంబదేవి ఆలయంలో సీఎం సోదరుడి పూజలు



అలంపూర్‌లో తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్, ఆగస్టు 17: ఐదవ శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం అలంపూర్‌కు చేరుకున్న వారికి ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ సాదర స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో గణపతిపూజ, అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి శాలువాతో సత్కరించారు.




25, 26 తేదీల్లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ

» పాల్గొననున్న 500 మంది క్రీడాకారులు
» 21న ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక
» జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 17 : జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్ వెల్లడించారు. శనివారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టోర్నీలో 17 జిల్లాల జట్లు పాల్గొంటాయని, 500 మంది క్రీడాకారులు, ఆఫీషియల్స్ హాజరవుతారని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. బాస్కెట్ మైదానంతో పాటు ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 21న ఉదయం స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఎంపికలు ఉంటాయని తెలిపారు. 1-1-2008 తరువాత పుట్టిన వారు ఎంపికలకు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు టోర్నీ ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, మునిసిపల్ చైర్మన్ హాజరుకానున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. కలకత్తాలో నవంబరు 29వ తేదీ నుంచి డిసెంబరు 5వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. సమావేశంలో చైర్మన్ మీర్ అర్షద్‌అలీ, ప్రధాన కార్యదర్శి నసురుల్లా హైదర్ మహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలీద్ అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, గోపాలకృష్ణ, కోచ్ ఖలీల్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

ఎర్రవల్లి, ఆగస్టు 17: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందింది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం స్టేజీ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్నది. కోదండాపురం ఎస్‌ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లాకు చెందిన లిఖితరెడ్డి(23), కర్నూలుకు చెందిన తరుణ్ హైదరాబాద్‌లోని గూగుల్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. తమ స్వస్థలాలకు కర్నూలు, నంద్యాలకు వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ధర్మవరం స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను అతి వేగంతో బైక్ ఢీకొనడంతో లిఖిత రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, తరుణ్ గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. లిఖితరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలుకు తరలించారు. మృతురాలి తండ్రి రాజగోపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

భూత్పూర్, ఆగస్టు 17: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి బిజినేపల్లి మండలంలోని వెలుగొండ గ్రామానికి చెందిన తుంగస్వామి (33) అనే వ్యక్తి తన అన్న అయిన తుంగ ఎల్లయ్య అనారోగ్యంతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అన్నను చూడడానికి ఈ నెల 13వ తేదీన తన మోటారు సైకిల్‌పైన వెలుగొండ గ్రామం నుంచి భయలుదేరి వెళుతున్న సమయంలో భూత్పూర్ మండలంలోని కప్పెట గ్రామ స్టేజీ దగ్గర అదుపు తప్పి మోటారు సైకిల్‌పై నుంచి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని అన్న అయిన తుంగ వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపాడు.

చికిత్స పొందుతూ మరో కూలీ మృతి

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 17 : చికిత్స పొందుతూ మరో కూలీ మృతి చెందింది. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడిన అనిత (33) కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ నెల 15న ఉండవల్లి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కర్నూలు జిల్లా ఈ. తాండ్రపాడు గ్రామానికి చెందిన 17 మంది వ్యవసాయ కూలీలు ఆటోలో గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచిపాడు గ్రామంలో ఓ పొలంలో కూలి పని చేసేందుకు రోజులాగే బయలుదేరారు. 44వ జాతీయ రహదారిపై వరసిద్ధి వినాయకపల్లి మిల్లు వద్ద వెనుక నుంచి ఒక కంటైనర్ ఆటోను ఢీకొనడంతో డ్రైవర్ నరసింహులుతో సహా 16మంది గాయపడ్డారు. సంఘటన స్థలంలో లక్ష్మీదేవి మృతిచెందగా, చికిత్స పొందుతూ అదే రోజు రమాదేవి మృతి చెందింది. మరుసటి రోజు ప్రియాంక మృతి చెందారు. మృత్యువుతో పోరాడుతూ శనివారం అనిత మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. వరుస మృతులతో ఇ. తాండ్రపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిడుగు పాటుకు పశువుల కాపరి దుర్మరణం

అమ్రాబాద్, ఆగస్టు 17 : పిడుగుపాటుకు గురై ఓ పశువుల కాపరి దుర్మరణం చెందిన దుర్ఘటన నాగర్‌కర్నూలు జిల్లా పదర మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకున్నది. పదర గ్రామానికి చెందిన కొయ్యల చిన్న లింగయ్య(55) తన సొంత పశువులతో పాటు, ఇతరుల పశువులను కాస్తూ ఉంటాడు. శనివారం ఉదయం యథావిధిగా గ్రామ సమీప అటవీ ప్రాంతానికి పశువుల మందను మేత కోసం తీసుకెళ్లాడు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. చిన్న లింగయ్యకు సమీపంలోనే పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. శనివారం సాయంత్రం చిన్నలింగయ్య ఇంటికి రాకపోడంతో గ్రామస్థులు పశువులు మేత కోసం వెళ్లే ప్రాంతాన్ని గాలించారు. ఈ క్రమంలో నక్కల గుట్ట ప్రాంతంలో చిన్న లింగయ్య విగతజీవిగా కనిపించాడు. పిడుగు పడి మృతి చెందినట్లుగా గ్రామస్థులు నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య బాల్‌చంద్రమ్మ, కుమారులు విష్ణు, అంజి, కుమార్తె పద్మ ఉన్నారు.

తిరుమలాపూర్‌లో 24 మేకలు మృతి

అమ్రాబాద్ మండల పరిధిలోని బీకే తిరుమలాపూర్ సమీప అడవిలో పిడుగు పడి 24 మేకలు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీశైలం అనే వ్యక్తి తనకున్న మేకలను అడవిలో మేపటానికి తీసుకుపోయారు. ఈ సమయంలో వర్షం రావడంతో ఒక చెట్టు వద్దకు మేకలన్ని చేరుకున్నాయని, ఆ సమయంలో పిడుగు పడి 24 మేకలు మృతి చెందినట్లు బాధితుడు శ్రీశైలం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.





రాష్ట్రస్థాయి పోటీలకు జడ్చర్ల విద్యార్థినులు


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు

జడ్చర్ల, ఆగస్టు 17 : రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా టీం పక్షాన బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లోని ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ శనివారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో 10వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు జరుగనున్నాయని పేర్కొన్నారు. జిల్లా టీంకు పాఠశాలకు చెందిన విద్యార్థినులు దివ్య, విజేత, సునీత, ఆర్తి, నిఖితలు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పీడీ రామ్‌కల్యాణ్, ఉపాధ్యాయులు గోపాల్, ఇబ్రహీం, సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

అధికారుల అండ.. సాగుతున్న దందా

● పట్టపగలే తరలిపోతున్న ఇసుక


ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

మిడ్జిల్, ఆగస్టు 17 : మండలంలోని నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని రైతులు పదే పదే చెబుతున్నప్పటికీ నియంత్రించాల్సిన అధికారులు పట్టనట్లుగా వ్యవహరిసున్నారు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే శనివారం పట్టపగలే ప్రభుత్వ పనిపేరుమీద అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో పలు గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు సొంత ఇంటి పనులకు ఇసుకను తరలిస్తే పట్టుకొని కేసులు నమోదు చేసే అధికారులు పట్టపగలే ఇసుకను పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని మండలంలోని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై చర్యలు తీసుకొని, అందుకు సహకారమందించే అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

పాడి రైతులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి


కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న పాడి రైతులు

కల్వకుర్తి, ఆగస్టు 17 : పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులను తక్షణమే అందించాలని పాల రైతుల రాష్ట్ర నాయకుడు కిషోర్ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌కు పాలశీతలీకరణ కేంద్రంలో డీడీకి పాడి రైతులు వినతి పత్రాలను సమర్పించారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ పాల రైతుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కల్వకుర్తిలోని వినతి పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ నెల 31వ తేదీలోపల అన్ని బిల్లులు చెల్లించకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. విజయ డెయిరీని రక్షించుకోవాల్సిన బాధ్యత పాల రైతులపై ఉందన్నారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించి పెండింగ్ బిల్లులను, నాలుగు రూపాయల ప్రోత్సాహకాన్ని వెంటనే విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, యాదగిరి తదతర పాల రైతులు పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె


కూలిన మట్టి మిద్దెను చూపుతున్న దంపతులు

కందనూలు, ఆగస్టు 17: నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లి గ్రామానికి చెందిన కేశ టాకయ్య అనే రైతు మట్టి మిద్దె కూలి త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లి గ్రామానికి చెందిన కేశ టాకయ్య భార్య లింగమ్మ కుటుంబ సభ్యులతో ఇంట్లో ఉన్నారు. అంతకు ముందే ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. భార్యాభర్త, పిల్లలు ఇంట్లో ఉన్నారు. మట్టి మిద్దె కూలిపోతుందో అనే అనుమానంతో కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. వచ్చిన అర్ధగంట లోపలే మట్టి మిద్దె పైకప్పు కూలి నేలమట్టమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ రాములు, మాధవరెడ్డిలు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి ఫోన్‌లో సమాచారమందించారు. దీంతో స్పందించిన ఆయన కేశ టాకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించేందుకు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కత్తె బాలయ్య, దండు బాలస్వామి, బండారు అమృతయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» ముగిసిన పంచాయతీరాజ్ సంఘటన శిక్షణ తరగతులు


సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్ గాంధీ సంఘటన ప్రతినిధులు

మన్ననూర్, ఆగస్టు 17: కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం చేపట్టే విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆర్‌జీపీఆర్‌ఎస్ జాతీయ సమన్వయకర్త కిరణ్ ముగబస అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన రెండు రోజుల శిక్షణ తరగతులు శనివారం రాత్రి ముగిసాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ చట్టాలను తెలుసుకొని ప్రజా క్షేత్రం ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించే విషయంపై మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, స్థానిక కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ , జోనల్ కోర్డినేటర్ జావేద్, జిల్లా చైర్మన్ చత్రూనాయక్ పాల్గొన్నారు.

24, 25 తేదీలలో నేషనల్ వీఐపీ చాలెంజర్ కరాటే కప్

- బ్రోచర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 17 : జీకె మాస్టర్ షోటోఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ ఈఐపీ చాలెంజర్ కరాటే కప్ బ్రోచర్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ నెల 24, 25వ తేదీలలో జడ్చర్లలో నిర్వహించనున్నట్లు వీఐపీ బ్లాక్‌బెల్ట్ అకాడమీ అధ్యక్షుడు బాద్మి ధ్రువ, టోర్నమెంట్ నిర్వాహకులు అశ్వక్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు లక్ష్మణ్‌నాయక్, షకీల్, నర్సింములు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ కానివారికి ప్రత్యేక పోర్టల్

పాలమూరు, ఆగస్టు 17 : రైతులకు రుణమాఫీ కానివారికోసం ప్రత్యేక ఫోర్టల్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కానివారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ఫోర్టల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జూలై-18, 2024 మొదటి విడత, జూలై-30, 2024 రెండోవిడత, ఆగస్టు-15, 2024 మూడో విడత రుణమాఫీ కొనసాగుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల కోసం మండల వ్యవసాయాధికారి తప్పనిసరిగా సీఎల్‌డబ్ల్యూ ఫోర్టల్‌లో రైతు సమాచార పత్రాన్ని నమోదు చేయాలన్నారు. ఆధార్ తప్పుగా ఉంటే ఎంఏవో తప్పనిసరిగా రైతు నుంచి ఎంఏవో ఆధార్ తప్పని సరి పొందాలనే ఆరు పద్ధతులను వివరించారు. రైతులకు ఎందుకు రుణమాఫీ కాలేదో వ్యవసాయ విస్తరణాధికారి, మండల వ్యవసాయాధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నెలరోజులపాటు ఈ వెసులుబాటు కల్పిస్తోందన్నారు.

ఏవీఆర్ కాలనీని గ్రామ పంచాయతీగా గుర్తింపు

భూత్పూర్, ఆగస్టు 17 : ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నగర్ (ఏవీఆర్) కాలనీకి గ్రామ పంచాయతీగా గుర్తింపు రావడంతో శనివారం ఆ తండావాసులు సంబురాలు చేసుకున్నారు. అందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ గిరిజనులతో కలిసి నాయకులు మిఠాయిలు పంచారు. మండలంలో భట్టు తండా ఉండేది. ఆ తండావాసులు పదేళ్ల కిత్రం కర్వెన రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, ఇళ్లను వదులుకున్నారు. దీంతో వారికి పునరావాసం కింద వెల్కిచర్ల శివారులో ప్రత్యేక కాలనీగా ఏర్పాటు చేసుకొని ఏవీఆర్ కాలనీగా పేరు పెట్టుకున్నారు. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విశేష కృషి చేశారని మాజీ సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. మునిసిపల్ ఛైర్మన్ బస్వరాజుగౌడ్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, పాల నర్సిములుగౌడ్, తదితరులు సంబురాల్లో పాల్గొన్నారు.

రేపు జామియా మసీదులో ధార్మిక సదస్సు

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 17 : జిల్లా కేంద్రంలోని జామియా మసీదులో ఈ నెల 19న జల్సాయే రహెమతులిల్ ఆలేమిన్ ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆలిండియా సున్నీ ఉల్మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహసిన్‌పాషా ఖాద్రీ, మజీద్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్‌జకీ తెలిపారు. శనివారం జామియా మసీదు ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్ర మాలేగావ్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ప్రసంగీకులు సయ్యద్ అమీనుల్ ఖాద్రీ ముఖ్య అతిథిగా హాజరై ధార్మిక సందేశం ఇస్తారని తెలిపారు. ధార్మికవేత్త సయ్యద్ కలీముల్లా హుస్సేనీ కాఫిఫ్‌పాషా పాల్గొంటారని, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మతపెద్దలు అమీనుద్దీన్‌ఖాద్రీ, గౌస్ మొహియొద్దీన్, జామియా మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్‌సనా, మహ్మద్ ఖలీముద్దీన్, తఖీహుస్సేన్, అబ్దుల్‌అజీజ్ మాదుమ్, అబ్దుల్లా, మతీన్ పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్

జడ్చర్ల, ఆగస్టు 17 : మునిసిపల్ కార్మికుల సమస్యలపై తప్పుదోవపట్టిస్తూ, కార్మికులను మోసం చేస్తున్న జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. జడ్చర్ల మునిసిపల్ కార్యాలయం ఆవరణలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలంటూ పోరాడుతున్న కార్మికులను పట్టించుకోకుండా, చర్చలకు పిలవకుండా కాలయాపన చేస్తూ, కార్మికుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతున్న కార్మికుల సమస్యలపై స్పందించకపోవడం కమిషనర్‌కు తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, మహేష్, కృష్ణ, సాగర్, కేశవులు, నరసింహ, యాదమ్మ, భారతి, దేవమ్మ, అంజమ్మ, శ్యామల, అరుణ, అనూష పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలకు న్యాయ అవగాహన కల్పించాలి

- న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఇందిర


మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్, ఆగస్టు 17 : గ్రామాల్లో ప్రజలకు చట్టాలపట్ల అవగాహన కోసం నెలలో ఒకసారైనా గ్రామ పంచాయతీలో మీటింగ్ నిర్వహించి న్యాయ అవగాహనతో పాటు లోక్‌అదాలత్ గురించి వివరించాలని న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఇందిర అన్నారు. శనివారం జిల్లా కోర్టులో ప్యానల్ అడ్వకేట్‌లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, పారాలీగల్ వలంటీర్లకు సెన్సిటైజేషన్ మీటింగ్ నిర్వహించారు. వచ్చేనెల 14న జరగబోయే జాతీయ లోక్‌అదాలత్ గురించి వివరించారు. ఈ సందర్భంగా వారి సందేహాల నివృత్తి కోసం సలహాలు సూచనలు చేశారు. అదేవిధంగా నాలుగో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎంఎస్‌కే భావన పట్టణంలోని స్టేట్‌హోం, శిశుగృహ, చిల్డ్రన్ హోమ్‌లను సందర్శించారు. అక్కడ ఉన్నవారికి నీటివసతి, భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

జడ్చర్ల, ఆగస్టు 17 : జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారు రంగనాయకస్వామి గుట్టపై వెలిసిన శ్రీరంగనాయకస్వామి దేవాలయాన్ని భక్తులు, పట్టణ ప్రజల సహకారంతో అభివృద్ధి చేస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి తెలిపారు. రంగనాయకస్వామి గుట్టపై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరంగనాయకస్వామి దేవాలయానికి 1300 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. స్వామి వారి దేవాలయంలో మూలవిరాట్టు పై భాగంలో కప్పు ఉండదని, కప్పు నిర్మాణం చేపట్టినా నిలబడదని, అందుకు ఉదాహరణలు సైతం ఉన్నాయని వివరించారు. గుట్టపైకి శ్రావణమాసంలోనే కాకుండా ప్రతీ నిత్యం భక్తులు వచ్చేవిధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్, విక్కీసింగ్ పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులను వినియోగించుకోవాలి

- జిల్లా కంజ్యూమర్స్ డిస్ప్యూట్స్ రిడ్రెసెల్ కమిషన్ చైర్మన్ ఎం. అనురాధ


మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అనురాధ

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 17 : వినియోగదారులు తమకు అనేక హక్కులు, చట్టాలు ఉన్నాయని, వినియోగించు కోవాలని జిల్లా కంజ్యూమర్స్ డిస్ప్యూట్స్ రిడ్రెసెల్ కమిషన్ ఛైర్మన్ ఎం. అనురాధ అన్నారు. శనివారం జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినియోగదారుల హక్కుల అవగాహన కార్యక్రమానికి ఆమె, స్థానిక డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం స్వచ్ఛత, ధర, ప్రమాణం వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే హక్కు వినియోగ దారునికి ఉందని ఆమె అన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1986లో వచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం అత్యంత ముఖ్యమైనదని, అన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరు వస్తువుల నాణ్యత, ధర, బరువు, తయారీపై ప్రశ్నించే హక్కును పొందుతారని ఆయన వివరించారు. అంతకుముందు వినియోగదారుల హక్కుల కరపత్రం ఆవిష్కరించారు. వన్‌టౌన్ సీఐ ఎం. అప్పయ్య, వినియోగదారుల న్యాయవాదులు విజయలక్ష్మి, చంద్రశేఖర్, అధ్యక్షులు బాల్‌రాజ్, శివ శంకర్, చందు, మల్లికార్జున్, సత్యనారాయణ, ఎ.రాజసింహుడు, రామకొండ, రషీద్ పర్వేస్, శ్రీనివాసులు, లలిత తదితరులు పాల్గొన్నారు.

అకృత్యాలపై ఆగ్రహం


బంద్‌తో మూసిఉన్న వ్యాపార సముదాయాలు

- ● బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను ప్రజాస్వామికవాదులంతా ఖండించాలని పిలుపు
- ● పాలమూరులో బంద్ స్వచ్ఛందం..సంపూర్ణం
- ● బంద్‌కు అన్ని వర్గాల మద్దతు
- ● హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ● వేలాదిగా తరలివచ్చిన హిందూ బంధువులు

మహబూబ్‌నగర్/ టౌన్/ హన్వాడ/భూత్పూర్, ఆగస్టు 17 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పాలమూరులో చేపట్టిన బంద్ విజయవంతమైంది. బంద్‌కు సంఘీభా వంగా వేలాదిమంది హిందూ బంధువులు రోడ్డెక్కారు. పట్టణంలోని టీటీడీ కల్యాణమండపం నుంచి పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. పురవీధులగుండా సాగిన ర్యాలీలో భారీగా జెండాలతో జైశ్రీరాం. భారత్ మాతాకి జై అంటూ చేసిన నినాదాలు పాలమూరులో మారుమోగాయి. ర్యాలీ న్యూటౌన్, బస్టాండ్, వన్‌టౌన్ చౌరస్తా మీదుగా రాంమందిర్, పాన్‌చౌరస్తా, గడియారం చౌరస్తా, పాతబస్టాండ్ మీదుగా తెలంగాణ చౌరస్తాకు చేరుకుంది. ప్రధాన రహదారిపై సాగిన ర్యాలీతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసుకుని బంద్‌కు మద్దతు పలికారు. ఎక్కడా దుకాణాలు. హోటళ్లు తెరువలేదు. సాయంత్రం వరకు కూడా దుకాణాలన్నీ మూసి ఉంచారు. అన్ని వర్గాల వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ర్యాలీ అనంతరం హైందవ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● అకృత్యాలను ఆపాలి..లేదంటే అదే రీతిలో బుద్ధిచెబుతాం : ర్యాలీ అనంతరం హాజరైన హిందూ బంధువులను ఉద్దేశించి ప్రముఖ పీఠాధిపతి శాంతకుమార్‌స్వామి, బ్రాహ్మణసమాజం అధ్యక్షుడు గొండ్యాల రాఘవేంద్రశర్మ, వీహెచ్‌పీ నేత మద్దియాదిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, అయ్యప్ప ప్రచార సేవాసమితి అధ్యక్షుడు సీమనరేందర్‌లు మాట్లాడారు. దాడులు ఇలానే కొనసాగిస్తే లేదంటే ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్లు తాము అదే రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో ఇంతటి దారుణమైన ఘటనలు, జుగుప్సాకరమైన రీతిలో అకృత్యాలు జరుగుతున్నా సెలబ్రెటీలు, రాజకీయ మేధావులు ఇంకా స్పందించకపోవడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందు ఐక్యవేదిక నాయకులు పద్మజారెడ్డి. అచ్చుగట్ల అంజయ్య, సంపత్, సురేశ్, సుబ్రమణ్యం, రెబ్బ విజయ్, శివకుమార్, ఆరేశ్వరమేశ్ , సతీష్‌కుమార్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.


పాలమూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక

● జిల్లా కలెక్టర్‌కు వినతి : బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కలిపించాలని కోరుతూ శనివారం హిందూ ఐక్య వేదిక నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

భూత్పూర్‌లో విశ్వహిందూపరిషత్ నాయకులు పట్నం శ్రీశైలం, రవికుమార్, హన్వాడలో హిందూ ఐక్యవేదిక (అఖిలపక్ష) ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.

ప్రజలు గుణపాఠం చెప్పినా బుద్ధి మారలే..

- కేటీఆర్, హరీశ్‌రావులు మదమెక్కిన ఏనుగుల్లా సీఎంను విమర్శిస్తున్నారు

- డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 17 : చేసిన తప్పులు, దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు సీఎం రేవంత్‌రెడ్డిపై దుమ్మెత్తిపోసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా తీరు మార్చుకోకుండా మాటలగారడీతో కేటీఆర్, హరీష్‌రావులు మదమెక్కిన ఏనుగుల్లా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన విధంగానే రుణమాఫీ చేశామని తెలిపారు. సీఎంకు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక హరీశ్‌రావు మీడియా ముందుకు వచ్చి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని చెప్పిన ఆయన పదవికి రాజీనామా చేయకుండా విమర్శలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. రైతులకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, అక్కడక్కడా కొంతమందికి సాంకేతిక సమస్య కారణంగా మాఫీ కాలేదని, వారికి కూడా మాఫీ చేసేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, నాయకులు సీజే బెనహర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మహాత్మాగాంధీ, రాజీవ్‌ల విగ్రహాల ఏర్పాట్లపై పరిశీలన

మహబూబ్‌నగర్ పట్టణంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో మహాత్మాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాల ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న పనులను శనివారం డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనందకుమార్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. విగ్రహాల ఏర్పాటుతో పాటు కూడలి సుందరీకరణ పనులు చేపడుతున్నారు. మహనీయుల త్యాగాలు మరువలేనివని, వారి మార్గాలను ప్రతీ ఒక్కరు అనుసరించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాద్రి. షబ్బీర్‌అహ్మద్, లక్ష్మణ్‌యాదవ్, ఖాజపాషా, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మహిళలు అండగా నిలబడాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- 160 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులు పంపిణీ

మహబూబ్‌నగర్, ఆగస్టు 17 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రూ.500 సబ్సిడీ సిలిండర్, మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరిట ఇస్తున్నామని, అందుకే మహిళలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి సంబంధించి 160 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి పెద్దమనసుతో కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, షబ్బీర్‌అహ్మద్, సీజే బెనహర్, జాజిమొగ్గ నర్సింహులు, మోతీలాల్, జలీల్, పాషా, మునీర్, ముస్తాక్, అబ్దుల్లా, రఘు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి

- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

గండీడ్ /మహమ్మదాబాద్, ఆగస్టు 17 : అప్పులు చేసుకోకుండా గ్రామ సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మహమ్మదాబాద్ మండల పరిధిలోని దేశాయిపల్లి గేటు వద్ద పల్లవి ఆడిటోరియంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశార. గండీడ్ మండలం పరిధిలో 13 మందికి, మహమ్మదాబాద్ మండలం పరిధిలో 42 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, వ్యవసాయ సహకార సంఘంలో రుణ మాఫీ అయిన రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. రుణమాఫీ కాని రైతులకు తప్పకుండా మాఫీ అవుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుల పాలు కాకుండా ప్రతీ గ్రామంలో సర్పంచులను, ఎంపీటీసీ సభ్యులను ఏకగ్రీవంగా గెలిపించుకోవాలని కోరారు. దేశాయిపల్లి గేటు నుంచి రాఘవపూర్ వరకు ఫోర్ వే రోడ్డుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఉమ్మడి మండల పరిధిలోని ఉపాధిహామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గండీడ్ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు కెఎం నారాయణ, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, పీసీసీ సభ్యుడు నరసింహారావు , పీఏసీఎస్ చైర్మేన్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ శాంతిరగ్యా, మాజీ వైస్‌ఎంపీపీ రాధారెడ్డి, ముదిరాజ్ సంఘం గండీడ్ మండల అధ్యక్షుడు బీ గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుంకిరెడ్డి సతీష్‌రెడ్డి, రాంలాల్, ఎంపీడీవో దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, తిరుపతయ్య, ఎంపీవో నరేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

● కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు : గుర్తింపు లేకవడంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు రాజీనామా చేసినట్లు గండీడ్, మహమ్మదాబాద్ మండలాల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డిలు మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఎంతగానో కృషి చేసిన తమకు పార్టీలో గుర్తింపు లేదని, కొత్తవారికి మాత్రమే గుర్తింపు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను గుర్తించినా గుర్తించకపోయినా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తలుగా పని చేస్తామని వారు అభిప్రాయపడ్డారు.

కొనసాగుతున్న అఖండ దీపారాధన

దేవరకద్ర, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని వెలిసిన శ్రీ ఈశ్వరవీరప్పయ్య దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా అఖండ దీపారాధన, భజన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అఖండ దీపారాధనతో పాటు సాయంత్రం భక్తులు భజనలు 41 రోజుల పాటు చేస్తుంటారు.

కళాశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

మిడ్జిల్, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ ద్వారా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చొరవతో మంజూరు చేయించిన రూ. 15లక్షల రూపాయలతో ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే ప్రహరీ నిర్మాణ పనులను పూర్తి చేసి కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ గౌస్, పలు పార్టీల నాయకులు బాల్‌రెడ్డి, రాముగౌడ్, ఉస్మాన్, సంపత్‌కుమార్, మారేపల్లి శేఖర్, గంజి శేఖర్, లింగం, గోపాల్, బాలయ్య, శంకర్, శివ, డీకే, రాజు, రమేష్, జహంగీర్, ఆదాం, బాలస్వామి, పర్వతాలు ఉన్నారు.

మద్యం ప్రియులపై దాడి చేసిన వైన్ షాపు యజమానులు

భూత్పూర్(మూసాపేట), ఆగస్టు 7 : మద్యం సేవించేందుకు వెళ్లిన మద్యం ప్రియులపై దుకాణ యజమానులు దాడులకు పాల్పడ్డారు. ఈ సంఘటన మూసాపేటలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మూసాపేట మండల పరిధిలోని సంకలమద్ది గ్రామానికి చెందిన శేఖర్, జనార్దన్‌తో పాటు మరో ఇద్దరు మిత్రులు కలిసి శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని కార్తీక్ మద్యం దుకాణం దగ్గరకు వెళ్లి మద్యం కొనుక్కొని పక్కనే ఉన్న పరిమిట్ రూములోకి సేవించడానికి వెళ్లారు. అంతకు ముందు వారు మద్యం షాపు పక్కన ఉన్న చికెన్ ఫ్రై షాపులో చికెన్ వేపుడు చేసి ఇవ్వాలని డబ్బులు చెల్లించి వెళ్లారు. సదరు షాపు అతను ఎంతకూ చికెన్ తీసుకరాకపోవడంతో మద్యం సేవిస్తున్న శేఖర్, జనార్ధన్ ఆ షాపు అతనికి కేక వేశారు. చికెన్ షాపు యజమానితో పాటు మద్యం షాపు యజమాని ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తున్న జనార్ధన్, శేఖర్, మరో ఇద్దరిపైన దాడులకు పాల్పడ్డారు. బాధితులు 100కు ఫోన్ చేయడంతో సంఘటన స్థలానికి మూసాపేట పోలీసులు చేరుకొని బాధితులతో పాటు దాడికి పాల్పడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి గొడవ వల్లనే పాలమూరు జిల్లా కేంద్రంలో ఇటీవలే ఒకరు చనిపోయిన సంఘటనను స్థానికులు గుర్తు చేసుకొని మద్యం షాపు యజమానుల దాడులను ఖండించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కోయిలకొండ, ఆగస్టు 17 : హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో కాళప్ప సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్స్‌లో బాత్‌రూంలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. హాస్టల్‌లో విద్యార్థుల హాజరు, తదితర రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రాధాకృష్ణ గ్రామ పంచాయతీ సిబ్బందిపాల్గొన్నారు.

పలు గ్రామాలలో భారీ వర్షం

మిడ్జిల్, ఆగస్టు 17: మండలంలోని వాడియాల, బోయిన్‌పల్లి, మిడ్జిల్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్న సమయంలో ఆకస్మికంగా కురిసిన భారీ వర్షంతో అన్నదాతలకు కాస్తా ఊరట కలిగినట్లైంది.

హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- ఐఎంఏ, జడ్చర్ల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

- జిల్లాలో పలు చోట్ల నిరసనలు చేపట్టిన వైద్యులు

జడ్చర్ల/ భూత్పూర్/ హన్వాడ/ నవాబ్‌పేట/ మిడ్జిల్, ఆగస్టు 17 : కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల వైద్యవిద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లాలో పలు చోట్ల ఆందోళనలు జరిగాయి. ఐఎంఏ, జడ్చర్ల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. హత్యాచార సంఘటనకు వ్యతిరేకంగా వైద్యసేవలను నిలిపివేసారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు సుజీత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడతూ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రభుత్వం పక్షాన స్థానిక పోలీసులతో సెక్యూరిటీ కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ శివకాంత్, డాక్టర్ నరేశ్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ దినేష్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు. ● భూత్పూర్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యుల బృదం ర్యాలీగా వచ్చి చౌరస్తాలో నిరసన తెలిపారు. వైద్యులు అబ్దుల్ రబ్, దిలీప్‌కుమార్, యమున, రాదిక, మాధురి, రమని, జహీరొద్దీన్, సీహెచ్‌వో ఆయుబ్‌ఖాన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ● హన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ చతుర్వేది, సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ● నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడులు చేసిన వారిని భారత ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శరభలింగం, శ్రీనివాసులు, భవాని సింగ్, విజయమ్మ, జయశీల, సువార్త, ఉష, పుష్ప, మాదవి, శారద, లక్ష్మీ దేవమ్మ, సంతోష, కేజియా, బాలేశ్వరి, ఇందిరా, ఆసీఫ, రాములమ్మ, పుష్పలత, భాగ్యలక్ష్మీపాల్గొన్నారు.


జడ్చర్లలో నిరసన ర్యాలీ అనంతరం హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళన చేస్తున్న ఐఎంఏ, జడ్చర్ల డాక్టర్ అసోసియేషన్ సభ్యులు

● మిడ్జిల్ : కోల్‌కతాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఏబీవీపీ నాయకులు వడ్డె శేఖర్, నవీన్, అజయ్, మణికాంత్, శ్రీను, దీపు, అంజన్, అనిల్, బాజీ, అక్రం, సురేష్, గోపాల్, జహంగీర్ ఉన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


నీల్యానాయక్ తండాలో ప్రతిష్ఠాపనోత్సవ పూజలు

హన్వాడ, ఆగస్టు 17 : చిన్నదర్పల్లి 15వ వార్డులోని నీల్యా నాయక్ తండాలో శనివారం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, నవగ్రాహ విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, జలాధివాసం కార్యక్రమాలు జరిగాయి. మూ డు రోజుల పాటు ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంజినాయక్, మన్యనాయక్, జాన్యనాయక్, శ్రీనునాయక్, రాజునాయక్, వెంకటేష్, శివనాయక్‌లు పూజలో పాల్గొన్నారు.

పేరుమాళ్ల గుట్టపై గ్రామస్థుల పూజలు

నవాబ్‌పేట, ఆగస్టు 17 : మండలంలోని కూచూర్ గ్రామ శివారులో వెలిసిన శ్రీ శివాంజనేయ స్వాముల ఆలయంలో పేరుమాళ్ల వంశీయులు శనివారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యనిపుణలుఉ పేరుమాళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఉత్తరాపల్లి రామాచారి సమక్షంలో గౌరిపూజ, సత్యనారా యణ వ్రతాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు, కూచూర్, హన్మసాని పల్లి, యన్మనగండ్ల, తూర్కతండా, సీతమ్మ తండా, దొడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పేరుమాళ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలంలో ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గుట్టపై వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం